# సావిత్రి లేచిపోలేదు

**దూరంగా** కోడి కూసింది. తూరుపు తెల్లవారబోతోంది. సావిత్రి పక్కమీంచి లేచింది. ఆమె ఆపులిస్తూ బద్ధకంగా లేవలేదు. పొద్దుపోయిందేమోనని తొట్రుపాటుతో, భయంతో లేచింది. భర్త ఇంకా లేవకపోవడంతో కాస్త ధైర్యంగా ఊపిరి పీల్చుకుంది. అయినా ఆమె మనస్సులో అసంతృప్తిగానే వుంది. ఇలా తెల్లవారకుండా వుంటే బాగుండునని అనిపిస్తూనే వుంది. అది తీయని అనుభవాల వల్ల కలిగిన అనుభూతి కాదు. తెల్లవారితే రణరంగమయ్యే బ్రతుకుమీద భయంవల్ల.

ఆమె కాలకృత్యాలు తీర్చుకోవడంకన్నా ముందు ఎన్నో పనులు చేస్తుంది. ఆ చెయ్యడం మహా వేగంగా, భయంతో చేస్తుంది. పక్కలెత్తి, ఇళ్ళు ఊడ్చి, వేణ్ణీళ్ళు పెట్టి, కాఫీ పెట్టేందుకు నీళ్ళు పడేసి అప్పుడామె మరో పని చేస్తుంది.

ధూర్జటి కళ్ళు తెరుస్తూనే నోరు కూడా తెరుస్తాడు. అతని దృష్టిలో తను తప్ప ఎదుటి వాళ్ళెవరూ మనుషులు కారు.

" ఏమ్ దేభ్యం ! ఈ తువ్వాలికక్కడెందు కారేశావ్-నీళ్ళు సరిగ్గా పిండాలని తెలీదూ ! ఏం ! చేతుల్లో సత్తా లేదూ ! ఇంట్లో కూర్చుని కంచాలు, కంచాలు లాగిస్తున్నావుగా ! "

" దరిద్రముఖం నా పాలిట దొరికింది. ఈ చీపురు నిలువుగా పెట్టావేం ? "

" ఇదిగో - ఈ కాఫీ శాస్త్రయోగ్యంగా వుంది " - ఇలాంటి వాటిలో వేటికో కొన్నిటికి సావిత్రి సన్నగా సమాధానం చెప్తుంది.

" ఏం పొగరెక్కిందా ? సమాధానాలు చెప్తున్నావ్ " " ఏం ? గొంతు పెరుగుతోందే " - అంటూ ఎగురుతాడు.

అనుక్షణం ఇలా కసురుతూ, సాధిస్తూ, సతాయిస్తూ, తనకి కావలిసిన చాకిరీ చేయించుకుంటూనే వుంటాడు. కాని అతనిలో సంతృప్తి కనపడదు. ప్రేమ, లాలిత్యం అనే మాటలు అతని నిఘంటువులో లేవు. ఎందుకంటే అతను చదువుకున్నది సంస్కృతాంధ్ర భాషలు కనుక అతని తిట్లు, శాపనార్థాలు చాలా బరువైన భాషలోనూ సమాసాలతోనూ ఉంటాయి.

తండ్రిగారు సంస్కృత పండితుడు. అందుకే ఈ కుమారుడికి ధూర్జటి అనే కవి పేరు పెట్టి, నిజంగా తన కొడుకు కవేమోనని అప్పుడప్పుడు తనలో తనే గర్వపడుతూ వుంటాడు. పాపం ఆయన చదువుకుని చేసిన వృత్తి పౌరహిత్యం కావడంవల్ల, అందులో పరువు తక్కువతనం వుందనే బాధతో కొడుకుని తెలుగు పండితుడి ఉద్యోగంలో చేర్చేవరకు అహోరాత్రులు కృషి చేసాడు.

సావిత్రి యంత్రంలా పనిచేసుకుపోతోంది - నిజానికి వున్నది ఇద్దరే అయినా. ధూర్జటి ఇద్దరు వేలు విడిచిన తమ్ముళ్ళని తన దగ్గర పెట్టుకుని చదువుకునే అవకాశం ఇచ్చాడు - వంట కార్యక్రమం చాలా నిష్ఠగా, చాలా సుదీర్ఘంగా సాగుతుంది. ఆ ఇద్దరు ధూర్జటి ఇంట్లో వున్నందుకు కొంత డబ్బు ఇస్తారు. వారెంత ఇస్తారో సావిత్రికి తెలీదు. సావిత్రి ఆ ఇంట్లో ఇల్లాలుగా కాక పనిమనిషిగానే ఎక్కువ చలామణీ అవుతుంది - ఆడదాన్ని ఎలా చూడాలో మహా, మహా కావ్యాల ద్వారా ధూర్జటి అర్థంచేసుకున్న విధానం వుంది. అది భార్య విషయంలో వదిలేసి, చెప్పుకింద నొక్కి వుంచాల్సింది భార్యనే అని నిర్ణయించుకున్నాడు ధూర్జటి.

" ఏం సావిత్రీ ! నీ మొహం మండా ! నీకు ఎనిమిది గంటలు దాటుతున్నా, వంటయి చావదే ! మా స్కూల్లో హిందీ టీచరు - వంట చేసుకుని, తిని, చక్కగా ముస్తాబై కనుల కింపుగా వస్తుంది " అన్నాడు.

సావిత్రి స్త్రీ హృదయం చివుక్కుమంది.

అయినా పెదవి విప్పే ధైర్యంలేదు. " శివుడు పనసపొట్టు కొట్టివ్వడం ఆలస్యమైంది. అయినా పూర్తికావచ్చింది. పది నిముషాలు " నెమ్మదిగా సమాధాన మిచ్చింది.

" ఓ........పనసపొట్టు కూర చేస్తున్నావా ! ఇదిగో రుచిగా చెయ్యి. ఉప్పు సరిగ్గా వెయ్యి. ఉప్పు దగ్గర నీ చేతులు పడిపోతాయి- అందుకు చెప్తున్నా. ఆ కాయ నా కోసం కోనసీమ నుంచి ఎవరో ప్రత్యేకంగా పంపారు. "

ధూర్జటి స్నానం పూర్తిచేసి, గాయత్రి చదివి నెమ్మదిగా తొమ్మిదిన్నరకి విస్తరిముందు కూర్చున్నాడు. సావిత్రి భయం భయంగా వడ్డన మొదలుపెట్టింది - ఆరింటికి స్నానంచేసి మడిబట్ట కట్టుకుని - ముఖాన ఇంత కుంకంబొట్టు పెట్టుకుని వంటలోకి దిగిన సావిత్రి అందాలు గురించి ఎవరాలోచించినా తప్పే.

" వంట బాగానే వుందిగానీ, నీ రూపమే భీకరంగా వుంది. కాస్త శుభ్రంగా వుండాలనిపించదా. భోజనానికి వచ్చే మగాడికి భార్య శుభ్రంగా, చూడముచ్చటగా కనిపించాలనే జ్ఞానం వుండదూ " - విసురుగా అన్నాడు.

సావిత్రి మనసు చితికిపోయింది.

" నాకు లేచింది మొదలు పనితోనే సరిపోతోంది. నేను ముస్తాబు చేసుకునేందుకు టైమేది ? "

" అలా ఎదిరించకు. పదిగంటలకల్లా స్కూలుకొస్తుంది మా హిందీ టీచరు. ఆ కట్టూ, ఆ బొట్టూ, ఆ రూపం ఎంత చూడ ముచ్చటగా వుంటుందనీ. అలా వుండటానికి రూపలావణ్యం కూడా వుండాలనుకో - అది వున్నా లేకపోయినా - చేతనైనంతలో చక్కగా. "

సావిత్రికి కళ్ళనీళ్ళపర్యంతమైంది. ఈమధ్య ఈ హిందీ టీచరు గోల ఇంట్లో గోడ గోడకీ పట్టేసింది.

" ఆడదంటే అలా చాకులా వుండాలి. ఎంత బాగా మాట్లాడుతుంది. ఎంత చురుకు. ఇదిగో ! నిజంగా ఆమె కళ్ళల్లో కళ్ళు కలిపి మాట్లాడుతుంటే - ఓ.....నిజంగా మూర్తీభవించిన స్త్రీత్వం.

సావిత్రికి వంటికి కారం రాసినట్లుంది. పక్కనే కూర్చుని భోజనం చేస్తున్న శివుడు, తారకరాముడు తలొంచుకుని మరీ తింటున్నారు. వారికేదో ఊపిరాడనట్లు, నీళ్ళు తాగుతూ ముద్దలు మింగుతున్నారు.

" మజ్జిగ పులుసులో ముక్క - మరికాస్త ఉడకొచ్చు. వంట కూడా అర్ట్. జాగ్రత్తగా చెయ్యాలి " - భోజనాలు పూర్తవుతుంటే సావిత్రి గుండెలమీంచి బరువేదో దించుతున్నట్లు భావన. ఇంకాస్త సహయం ఓపికపడితే - మరో కొన్ని గంటలు తనకి మానసిక విశ్రాంతి.

"ఇదిగో ! ఎందుకలా దరిద్రవగొట్టు ముఖమేసుకుని కూర్చుంటావు గానీ - ఓ స్టీలుబాక్సులో పనసపొట్టుకూర పెట్టియ్యి - మా స్కూల్లో హిందీ టీచరు వాళ్ళు గుంటూరుజిల్లా వాళ్ళు. వాళ్ళకిది తెలీదు. రుచి చూపిస్తా. "

" ఎంతో వుండదేమో.... " సావిత్రి మాట పూర్తికాలేదు.

" చాల్లేవే పాచి ముఖం ! నువ్వీసారి తినకపోతే నష్టంలేదు. మనం ఎప్పుడూ చేసుకునేదేగా ".

సావిత్రి గబగబా కూర స్టీలుబాక్సులోకి సర్దేసింది - కళ్ళనీళ్ళు ఆపుకోవడం గగనంగా వుంది. కానీ కళ్ళల్లో నీరు కనిపిస్తే దానికో దండకం చదివి రాద్ధాంతం చేస్తాడు.

వేసవికాలం వస్తే నూతుల్లో చెరువుల్లో నీళ్ళు ఎండిపోతాయి. నాలుగేళ్ళ తన వివాహ జీవితంలో ఈ కన్నీళ్ళు ఎండిపోయినా బాగుండేది.

సావిత్రి అనుకున్నంతా అయింది.

" ఏడుపు ముఖంతో ఎదుటివారికేమీ ఇవ్వకూడదు. వెధవముఖం ఎప్పుడూ ముసురుపట్టినట్లుంది-మా హిందీ టీచరు- ఏదైనా మధ్యాహ్నం టిఫిను తెప్పించుకుంటే చాలు. తినండి, తినండి అని ఎంత అభిమానంగా అంటుందో " " అసలా ముఖంలో వెలుగు నీకు వెయ్యి జన్మలెత్తినా రాదు " ధూర్జటి చెప్పులేసుకుని బయటకెళ్ళిపోయాడు.

" ధూర్జటి పల్కులకేల కలిగెనో ఈ.... "

" ఘంటసాల " కమ్మగా అంటున్నారు రేడియోలోంచి —

సావిత్రి నెమ్మదిగా తలుపేసుకుని లోపలి కొచ్చింది. తెలియని అశాంతి ఆమెలో రగులుకుంటోంది. ఆలోచిస్తూనే సబ్బుతో ముఖం కడుక్కుంది. పౌడరు రాసుకుని, గుండ్రంగా అందంగా చిన్న బొట్టు పెట్టుకుంది. లేత తమలపాకుల్లా తన బుగ్గలు తనకెంతో మృదువుగా అందంగా అనిపించాయి. పరీక్షగా తన ముఖాన్ని అద్దంలో చూసుకుంది. కళ్ళు విశాలంగా, నల్లగా అందంగా వున్నాయి. తలకట్టు కూడ నొక్కులు తీరి ముచ్చటగా వుంది - అందం అనే మాటకి అర్థం ఏమిటి ?—

దొడ్లో నూతిచప్టా పక్కగా శుభ్రంగా తుడుచుకుని చాపవేసుకుంది. పెరట్లో అంతా నీడలు పరిచే బాదంచెట్టు, అక్కడ మరీ చలువ పందిరి వేసినట్లుంది - ఎంత ఎండగా వున్నా అక్కడ చల్లగానే వుంది. చాపమీద నడుం వాల్చింది సావిత్రి.

హిందీ టీచరు ఆమె మనసులో వచ్చి తిష్ఠవేసింది. తల విదిలించింది. తన కీ పెళ్ళిచేసి, తన జీవితం నరకప్రాయంగా చేసిన అందరూ గుర్తుకొచ్చి, కోపమొచ్చి ఏడుపొచ్చింది.

నాన్న గుర్తుకొచ్చి సావిత్రి ఏడ్వకుండా వుండలేకపోయింది. ఈ సంఘంలో అందరిచేతా చేతకానివాడని ముద్రవేయించుకున్న నాన్నని తల్చుకుంటే వేదన భరించలేకపోయింది.

తనని వొళ్ళో కూర్చోబెట్టుకుని ఎన్ని కథలు చెప్పేవాడు ? ఎన్ని పద్యాలు తనచేత చదివించేవాడు ? నిజానికి నాన్న యింట్లో వున్నప్పుడు తనకి వేరే ప్రపంచమే తోచేదికాదు. తను క్రమంగా పెరుగుతున్నప్పుడు నాన్న చెప్పే విషయాలు విన్నాక, ఆయన్ని అంతా ఎందుకు చేతకాని వాడంటారో తన చిన్న బుర్రకి అర్థం అయ్యేదికాదు.

నెమ్మదిగా తన కర్థమైంది. నాన్న స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడానికి మహాత్మాగాంధి పిలుపు విని, సగంలోవున్న చదువుని పెళ్ళిచేసుకున్న పెళ్ళాన్ని వదిలేసి వెళ్ళిపోయాడు. ఎంతమంది శ్రేయోభిలాషులు, వెంటపడి చెప్పినా అతను వినలేదట.

మనకెందుకా రాజకీయాలు మన బతుకేమిటో మనం చూసుకోవాలి గాని అని మావయ్య చెప్తే నాన్న విన్నాడు కాదుట.

మనకి స్వాతంత్ర్యం వస్తే ఎంత ? రాకపోతే ఎంత ? బంగారం లాంటి భవిష్యత్తు నాశనం చేసుకోకు అని వూరి పెద్దలు, వాడ చిన్నలూ అందరూ హితబోధ చేసినా వినకుండా దేశాలు పట్టుకుని తిరిగాడట. ఉద్యోగం సద్యోగం లేకుండా ఇల్లుచేరిన నాన్నని మావయ్య ఎంతో చులకనగా చూసేవాడు. అమ్మ ఎవ్వరికీ వినిపించకుండా సాధించేది. అనుకోకుండా, పుట్టిన తనమీద అమ్మకంటే నాన్నకే ఎక్కువ ప్రేమ అనిపించేది తనకి. అమ్మ ఎప్పుడూ ఒక్కటే చెప్పేది మావయ్య మనని

పోషిస్తున్నాడు. మావయ్య మాట జవదాటకూడదు ఇదే పాఠం. అప్పుడెందుకో ఆ మాటలు తనకి విసుగ్గా వుండేవి.

తను థర్డుఫారంలో వున్నప్పుడు తనకి మహాత్మాగాంధి జీవితం నాన్న చెప్పడం గుర్తుంది. ఇప్పటికీ ఆయన జీవితచరిత్ర తన పెట్టిలో దాచుకుంది. గొప్ప గొప్ప వారి జీవితాల గురించి వాళ్ళ గగుర్పొడిచేలా చెప్పేవాడు. దేశభక్తి గురించి, సేవాధర్మం గురించి సత్యవాక్య పరిపాలన గురించి సౌశీల్యం గురించి తండ్రి చెప్పిన మాటలు ఇప్పటికి సావిత్రి మస్తిష్కంలో మారుమోగుతూనే వుంటాయి. కానీ అవి జీవితంలో ఎంతటి సత్యదూరాలో అర్థమవుతున్నప్పుడు ఆకాశంనుండి అధఃపాతాళానికి పడిపోతున్నట్లనిపిస్తుంది. మనిషికి మానసిక స్వేచ్ఛ అవసరం. స్వార్థంతో కూడుకున్న ఏ పనీ అది ఎంత మంచి పనైనా అది గొప్పపని కాదు. నువ్వు ఎవ్వరికీ భయపడి నీకు యిష్టంలేని పని చెయ్యకూడదమ్మా. స్త్రీ ఆత్మరక్షణకోసం కనీసం గోళ్ళయినా పెంచుకుని తమని తాము రక్షించుకోవాలి. స్త్రీ ఎంత సంస్కారవంతురాలైతే ఆ కుటుంబం అంత వున్నతికి వెళ్తుంది. భార్య అంటే కస్తూరిబాయిలా వ్యక్తిత్వం కలిగివుండి భర్త మార్గాన్ని అనుసరించేదవ్వాలి. తండ్రి చెప్పే మాటలు పూర్తిగా అర్థమయేవికావు. కాని ఎంతో ఆసక్తికరంగా వుండేవి. సావిత్రి ఆలోచించినా చివరికి మళ్ళీ నిరాశ వచ్చేసేది. నిజంగా నాన్న చేతకానితనంవల్లనే తన బ్రతుకిలా అయింది. తను ఫోర్తుఫారంలో వుండగా ఈ సంబంధం మావయ్య తీసుకొచ్చాడు.

ఆ రోజంతా ఇంట్లో గుసగుసలు. నాన్న, తనే దూరంగా వున్నారు. వాళ్ళొస్తారు చూసుకోవడానికి అన్నప్పుడు తను అనాలోచితంగా నాకు పెళ్ళివద్దు అంది.

చెంప ఛెళ్ళుమంది. అమ్మ కొట్టిన దెబ్బ ఇంకా గుర్తుంది. సావిత్రి నెమ్మదిగా చెంప నిమురుకుంది. నాన్న ఎందుకీ పెళ్ళి వద్దని

చెప్పడు ? అనుకుంది అప్పట్లో. తర్వాత తెలిసింది, నాన్నకా శక్తి లేదని. గాంధిగారు స్త్రీ స్వాతంత్ర్యం గురించి స్త్రీ శక్తి గురించి స్త్రీ ఔన్నత్యం గురించి ఎన్నో చెప్పారు. ఆయన జీవితంలో ఆచరించి చూపించారు.

అవన్నీ నాన్న తనకి చెప్తుండే అప్పుడు పొంగిపోయేది. కానీ తన నీరోజు ఈ చీకటికొట్లోంచి అవేమీ బయటకి లాగలేవని తెలిసి ఊపిరాడటంలేదు.

తన పెళ్ళి జరుగుతుండగా లెక్కల మాష్టారన్నారు, అమ్మాయి తెలివైంది చదివిస్తే బాగా చదువు వస్తుంది అని. అప్పుడమ్మ కంఠం తగ్గించి, అదే మాష్టారు ఇది చురుగ్గావుంది. దీన్ని ఇలాగే స్కూలుకి పంపితే ఆ స్కూలు ఫైనలు పాసయి కూర్చుంటుంది. ఆ తర్వాత అంతకుమించిన వాళ్ళని తేవాలంటే మన తరమా ! పైగా అంత చదువుకున్న పిల్లని సామాన్య కుటుంబాల్లో చేసుకోరు అంది అదేదో జీవిత సత్యంలా.

అప్పటి లెక్కల మాష్టారి కళ్ళల్లో కనిపించిన విచిత్రమైన సానుభూతి యిప్పటికీ తన గుండెల్లో నిలిచి వుంది.

సావిత్రి లేచి వెళ్ళి మళ్ళీ గాంధిగారి జీవితచరిత్ర చదువుదామని తీసింది.

*

తలుపు శబ్దానికి, అంట్లుతోముతున్న సావిత్రి చెయ్యి కడుక్కొని ఒక్క పరుగున వెళ్ళి తలుపుతీసింది. ఒక్కసారి తలుపు చప్పుడైతే వెంటనే తియ్యాలి. క్షణం ఆలస్యమైనా ఆ తర్వాత జరిగే రాద్ధాంతం సావిత్రికి తల్చుకుంటే భయం.

ఎదురుగా శివుడు. హమ్మయ్య అనుకుంది సావిత్రి. ఎందుకో ఆ క్షణంలో శివుణ్ణి చూస్తే వుత్సాహంగా అనిపించింది. ఎన్నాళ్ళగానో చూడాలనుకుంటున్న ఆత్మబంధువుని చూసినట్లనిపించింది.

“ ఏమిటి వదినా అలా నిలబడిపోయావు ” అన్నాడు నవ్వుతూ.

“ఏంలేదుగానీ—ఆ కాసిని అంట్లూ పూర్తిచేసి, నీకు టీ పెడతాను” అంది.

“ అబ్బే నాకేం తొందరలేదుగానీ నీకో మాట చెప్పాలి ” అన్నాడు శివుడు.

“ ఏమిటి ” అంది.

“ ఈరోజు అన్నయ్య స్కూలు వార్షికోత్సవం. నువ్వు కూడా వస్తావా ? ” అన్నాడు.

“ అమ్మో ! నేనా ” అంది.

“ ఏం ? ఎందుకంత భయం. నేను అన్నయ్యతో చెప్పాను. నిన్ను తీసుకువస్తానని ”

“ ఏమన్నారు ? ”

“ నువ్వు దగ్గరుండి తీసుకురా అన్నాడు ” సావిత్రి మనసు ఆనందంతో ఊగిపోయింది.

అరగంటలో వంట పూర్తిచేసింది. ఇల్లంతా అద్దంలా సర్దేసింది. నిరాడంబరంగా, అందంగా, పొందికగా తయారైంది. వదినని రిక్షా ఎక్కించి తను సైకిలుమీద బయలుదేరాడు శివుడు.

రంగు రంగుల పూల దుస్తుల్లో ఆడపిల్లలు, హుషారుగా కేరింతలు కొడుతున్న మగపిల్లలు చూడముచ్చటగా అనిపించింది. విరబూసిన వనంలోకి వచ్చినట్లు సావిత్రికి హాయిగా వుంది.

అందమైన ఆడపిల్లలు ప్రార్థన పాడారు. చిన్న చిన్న నృత్యాలు-హాస్య నాటికలు-మధ్య మధ్య పాటలు కార్యక్రమం రంజుగా సాగుతోంది.

ఆ తర్వాత ఒక విలక్షణమైన హాస్యరచనని కొద్దిపాటి అభినయంతో, ధూర్జటి, హిందీ టీచరూ వేదిక ఎక్కి చదివారు. అప్పుడామెను చూసింది సావిత్రి. తన మొగుడు నిరంతరం గాయత్రి జపంతోపాటు జపించే ఆ హిందీ టీచరీమె అనుకుంటె మనసుకు చేదు మింగినట్లనిపించింది.

హిందీ టీచరు కళ్ళు పెద్దవి అవునో కాదో గానీ గుడ్లు మాత్రం పెద్దగా ముందుకొచ్చినట్లుంటాయి. నిజానికి కొందరివి మిడిగుడ్లు అంటారు. మనిషికున్న అందంకంటె ప్రదర్శించే హొయలూ, ఓరచూపులూ బహుశా మగవారి నాకర్షించే గుణాలు.

ఇద్దరూ వేదిక ఎక్కి ప్రపంచాన్ని మరిచారనే చెప్పాలి. ధూర్జటి తనకున్న పాండిత్యాన్ని ప్రదర్శించాడు, హిందీ టీచరు వేయగలిగినన్ని టక్కులు వేసింది. అలాంటి ప్రదర్శనలు చూసేవారికి హేళనతోకూడిన ఉత్సాహాన్ని కలిగిస్తాయి. అందుకే అందరూ దండిగా చప్పట్లు కొట్టారు.

కార్యక్రమమైంది. వచ్చినప్పటి వుత్సాహం సావిత్రిలో చచ్చిపోయింది. శివుడు వెంటరాగా ఇల్లుచేరింది. ఆ ప్రదర్శనపట్ల నలుగురూ చేసిన వ్యాఖ్యలు విన్న శివుడి మనస్సు చివుక్కుమంది.

పదినేం మాట్లాడకపోవడంతో అతను మిగిలిన కార్యక్రమం గురించి మాట ఎత్తలేదు. యిద్దరూ మౌనంగా ఇల్లు చేరారు.

*

కాఫీ తాగి, ధూర్జటి ఫోటోఫ్రేములోంచి పెళ్ళినాటి ఫోటో తీసి, మరొక ఫోటో అమరుస్తుంటే చూసి నిర్ఘాంతపోయింది సావిత్రి.

అది ఆనాడు వేదికమీద హిందీ టీచరుతో తీయించుకున్న ఫోటో. ఓరచూపుల వయ్యారి కొరుక్కుతినేద్దామన్నట్లు కోరచూపుల కోణంగి.

సావిత్రి మనసు ఆగలేదు. అది ఎవరయినా చూసినా తనకెంత అవమానం? "అదేమిటా ఫోటో" అంది. ఇంకా ఆమె మాట పూర్తికాకుండానే "ఏం? నీ కేపైనా అభ్యంతరమా! నీ బోడి అభ్యంతరంతో నాకేమీ లెక్కలేదు. నేను ఇది ఇక్కడే పెడతాను. ఎవరేమంటారో చూస్తాను" అన్నాడు గట్టిగా నిర్లక్ష్యంగా.

సావిత్రి తలొంచుకుని నిలబడింది.

"అదిగో! చవలున్న మగాడ్ని నేను. మీ నాన్న వచ్చి అడుగుతాడా! మీ మామయ్య వచ్చి అడుగుతాడా! రమ్మను. నా యిష్టం. నా యిష్టం వచ్చినట్లు నేను చేస్తాను. నన్ని ప్రపంచంలో ఎవ్వరూ, నా యిష్టానికి వ్యతిరేకంగా చేయించలేరు" అంటూ అరిచాడు.

సావిత్రి ఒకసారి అతనివంక చూసింది. మూర్తీభవించిన మూర్ఖత్వం అంచులుదాటిన అహంకారం భరించలేని స్వార్థం అసహ్యం వేసే నీచత్వం.

భార్య—ఒక మనిషి—మనసున్న మనిషి. తనతో జీవితం పంచుకోటానికొచ్చిన స్త్రీ—ఆమెని అవమానించటం ఆమె మనసుని గాయపరచటం ధర్మంకాదు అనే కనీస జ్ఞానంలేని చదువుకున్న మూర్ఖుడు.

తనకు మొగుడు—

అతనివంక అంతసేపు చూసినందుకు అవమానంతో తలొంచుకుంది సావిత్రి. నెమ్మదిగా అక్కడ్నించి తప్పుకుంది. పక్కగదిలోంచి శివుడు ఇబ్బందిగా కదిలిన నీడ—తారకరాముడు జోళ్ళు వేసుకుని బయట కెళ్ళిపోయాడు.

"అలా దారికి రా! నా యిష్టం. నా యిష్టం. నోరెత్తితే ఏం చేస్తానో చెప్పలేను. దిక్కులేకుండా పోతుంది నీకు. నోరుమూసుకుని పడుండు" గట్టిగానే అరిచాడు ధూర్జటి—

సావిత్రి నిశ్శబ్దంగా ఏడ్చింది. తన మొగుడు మరొక ఆడదాన్ని తగులుకున్నందుకు కాదు. తనకక్కడ చిక్కడిపోయినందుకు.

*

మిట్టమధ్యాహ్నం. ఎండ మండిపోతోంది. సావిత్రి అంట్లు నూతి పళ్ళెంలో వేసుకుని తోముతోంది.

హడావుడిగా శివుడొచ్చాడు—వస్తూనే

" వదినా " అన్నాడు. నిజానికది పిలుపుకాదు అరుపు.

" ఏమిటయ్యా " అంటూ వచ్చింది.

" నువు తొందరగా చీర మార్చుకో " అన్నాడు. అతని ముఖం ఎర్రగా, వికృతంగా కించిత్ కోపంగా వుంది.

" ఏమిటయ్యా ఏం జరిగింది ? "

శివుడు ఒక్కక్షణం తటపటాయించాడు. పరీక్షగా సావిత్రికేసి చూశాడు. నెమ్మదిగా తగ్గుస్వరంతో అన్నాడు.

" వదినా ! నువ్వేం కంగారుపడకు. అన్నయ్యని హాస్పిటల్లో చేర్చారు. "

"ఎందుకు ? ఏమైంది" ఒక్క క్షణం శివుడు తటపటాయించాడు— "అయ్యో వదినా నీ కెలా చెప్పాలో తెలీటంలేదు" అన్నాడు అస్తిమితంగా. ఒక్క క్షణంలో సావిత్రిలో ఎంతో గంభీరం చోటుచేసుకుంది. మరణానికి సిద్ధపడినవారికి మధ్య విషయాలు పెద్దగా బాధించవు.

" శివా ! చెప్పు. ఒక్కటి మాత్రం అడుగుతున్నా — చెప్పేది మాత్రం నిజం చెప్పు. నన్ను మోసపుచ్చకు. "

" వదినా! నీకు నే నెప్పుడూ అబద్ధం చెప్పనమ్మా—ఆ హిందీ టీచరు లేదూ! ఆవిడ అన్నయ్యతో వేసిన వేషాలన్నీ వేసి, వాళ్ళాయనకి అన్నయ్య వెంటపడి వేధిస్తున్నాడని చెప్పిందట. ఆయన నలుగురు మనుషుల్ని పెట్టి కొట్టించి రాణీగారి తోటలో పడేయించాడు. ఎవర్నో చూసి నాకు చెప్పారు. నేను హాస్పటల్లో చేర్పించి వస్తున్నాను " శివుడు తలొంచుకునే చెప్పాడు.

సావిత్రి గుండెల్లో సముద్రఘోష పర్వతాలు పలుగుతున్న ధ్వని లావాలు పొంగుతున్న వేడి దావానలం అంటుకుంటూ అంతా పాకుతున్న సెగ సముద్ర మధ్యంలో దాని కిదే అంటుకున్న బడబాగ్ని.

ఊపిరి సలుపని ఆవేదన—అవమానం.

తన మొగుడు ఎవరితోనో తిరిగినందుకు కాదు ఆ ప్రియురాలి మొగుడు భార్యకోసం తన్నించినందుకు. ఆ అవమానం పొందినందుకు ఆ మొగుడి భార్య అయినందుకు. అతనికి భార్య యందున్న మోజులో వందోవంతు తనయందు భర్తకి లేనందుకు. అలాంటి మొగుడికి భార్య అయినందుకు తను కోరబడనిచోట పట్టెడు మెతుకులకోసం పడివున్నాననే అవమానం. మళ్ళీ ఆ మనిషివంక చూసి, మామూలుగా ఎలా వుండగలను అనే అవమానం. సరదాలకి సాహిత్యాలకీ ప్రియురాలు, సేవకీ అవమానం పొందటానికీ ఇల్లాలు. తను ఇల్లాలు స్థానంలో వున్నందుకు అవమానం.

సావిత్రి కళ్ళు గిర్రున తిరిగాయి. కష్టంమీద నిలద్రొక్కుకుంది. ఇపుడు తను తేల్చుకోవాలి. తను అతని ముఖం చూడలేదు. ఒక్క క్షణం తన మనసుమీద తగిలిన దెబ్బ ఇది. వెంటనే తను మరెవ్వరికీ కనిపించకుండా వెళ్ళిపోదామనుకుంది. అవును. వెళ్ళిపోవాలి అందరూ లేచిపోయింది అనుకున్నా ఫరవాలేదు. వెళ్ళిపోవాలి.

అయినా ఎక్కడికీ వెళ్ళలేకపోయింది సావిత్రి. మరొక మగాడ్ని పెట్టుకోగల శక్తి ఆమెకి వుంటే, ఆమె మొగుడలా పెద్దేగిపోయి వుండేవాడు కాదు. ఆమె అన్నవరం కొండమీద కొబ్బరిచిప్పలు అడుక్కున్నా ఈ పొట్ట గడవకపోదు అనుకున్నైనా వెళ్ళలేకపోయింది.

ఈ చాకిరీ ఎవరికి చేసినా గుప్పెడు మెతుకులు దొరక్కపోవని అనుకున్నా వెళ్ళిపోలేకపోయింది. కేవలం పొట్ట గడవటంకోసమే భర్త దగ్గర వుండనవసరం లేదని తెలిసీ వెళ్ళలేకపోయింది. నరనరాల్లోంచి ఆమెలో ప్రవహించే పిరికి రక్తం ఆమెని వెళ్ళనివ్వలేదు.

"వదినా! ఒక్కమాట చెప్పగలను" అన్నాడు నెమ్మదిగా శివుడు. ఏమిటి? అన్నట్లు చూసింది సావిత్రి.

" అన్నయ్యకి నిజంగా ఆమెతో ఏదో వుందని నే ననుకోను " అన్నాడు దృఢంగా.

"మీ అన్నయ్యకి వున్నది నోటి రంకుతనమేగాని నిజం రంకుతనం లేదని నాకు తెలుసు " అంది ఉక్రోషంగా. శివుడు వదిన నోట్లోంచి వచ్చిన పరుష వాక్యాలకి క్షణం నివ్వెరపోయాడు.

" నడు " అంది.

" కానీ ఆ హిందీ టీచరు మాత్రం రంకులాడి " అన్నాడు కసిగా. మౌనంగా సావిత్రి భర్తకోసం కదిలింది. మరి సావిత్రి కదా!